నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
29 నవంబర్ 2023
పేజీలు 8

## హీరాలాల్ సామారియా

కేంద్ర సమాచార కమిషన్ ముఖ్య కమిషనర్‌గా 1985 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ క్యాడర్ మాజీ ఐఏఎస్ అధికారి హీరాలాల్ సామారియా బాధ్యతలు చేపట్టారు. హీరాలాల్ సామారియా స్వస్థలం రాజస్థాన్. 2020 నవంబర్ 7న కేంద్ర సమాచార కమిషనర్‌గా నియమితులై ప్రస్తుతం పదోన్నతి పొందారు. ఈ బాధ్యతలు చేపడుతున్న తొలి దళిత వ్యక్తిగా హీరాలాల్ గుర్తింపు పొందారు. ఆయన 2025 సెప్టెంబర్ 13 వరకు ఈ పదవిలో ఉంటారు.


# అంతర్జాతీయం

## విశ్వసుందరిగా షెన్నిస్



నికరాగువాకు చెందిన షెన్నిస్ పలాసియోస్ నూతన విశ్వసుందరిగా ఎంపికయ్యారు. అంతర్జాతీయ అందాల పోటీలో నికరాగువాకు ఇదే తొలి విజయం. నవంబర్ 18న జరిగిన మిస్ యూనివర్స్-2023 పోటీల్లో 84 దేశాలకు చెందిన వారు పోటీ పడ్డారు. ఈ పోటీల్లో థాయ్‌లాండ్‌కు చెందిన ఆంటోనియా పోర్సిల్డ్ మొదటి రన్నరప్ కాగా ఆస్ట్రేలియాకు చెందిన మోరయా విల్సన్ రెండో రన్నరప్‌గా నిలిచారు. మన దేశం తరఫున పోటీల్లో పాల్గొన్న శ్వేతా శార్దా తొలి 20లో నిలిచారు.

## భారత్-ఆస్ట్రేలియా 2+2 చర్చలు



భారత్-ఆస్ట్రేలియా మధ్య 2+2 చర్చలు నవంబర్ 20న ఢిల్లీలో జరిగాయి. రక్షణ రంగంలో సహకారం పెంచుకోవడం, కీలక ఖనిజాలు, వర్తకం, పెట్టుబడులు వంటి రంగాల్లో వ్యూహాత్మక సంబంధాలు మెరుగుపరుచుకోవడంపై ఈ సమావేశంలో చర్చించారు. కృత్రిమ మేధ, జలాంతర్గాములు, డ్రోన్ల వేట, సైబర్ రంగాల్లో సహకారంపై రెండు దేశాల సైన్యాలు దృష్టి సారించాలని నిర్ణయించారు. హైడ్రోగ్రఫీపై సహకారం, గాలిలో విమానాలకు ఇంధనం నింపడం వంటి అంశాల్లో భాగస్వామ్యం కోసం జరుగుతున్న చర్చలు తుదిదశకు చేరుకున్నట్లు ఇరు దేశాల రక్షణ మంత్రులు వెల్లడించారు. చర్చల్లో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, ఆస్ట్రేలియా ఉపప్రధాని, రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్, విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ హాజరయ్యారు.


## ఆందోళనకర స్థాయికి భూతాపం

పరిమితిని మించి భూతాపం పెరుగుతుందని ఐక్యరాజ్య సమితి నివేదిక పేర్కొంది. పారిశ్రామికీకరణకు ముందు నాటితో పోలిస్తే భూతాపం 2.5 నుంచి 2.9 డిగ్రీ సెల్సియస్ మేర పెరిగే దిశగా పయనిస్తుందని ఐరాస వివరించింది. బొగ్గు, చమురు, గ్యాస్ వినియోగం వల్ల గతేడాది గ్రీన్‌హౌస్ వాయువులు 1.2 శాతం పెరిగాయని వెల్లడించింది. ఈ ఏడాది ఆరంభం నుంచి సెప్టెంబర్ చివరి నాటికి ప్రపంచ సరాసరి



ఉష్ణోగ్రతల్లో పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్‌ను దాటేసిన సందర్భాలు 86 రోజుల్లో చోటుచేసుకున్నాయని వివరించింది. ఆ తర్వాత అక్టోబర్ మొత్తం, నవంబర్‌లో మొదటి రెండు వారాల్లో ప్రతి రోజూ ఇదే పరిస్థితి నెలకొందని తెలిపింది. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు 40 శాతం రోజుల్లో ప్రపంచ సరాసరి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల ఆ స్థాయికి చేరిందని పేర్కొంది.

## పాక్ అత్యున్నత పురస్కారం



ముంబయి కేంద్రంగా పనిచేస్తున్న దావూదీ బొహ్రా ఇస్లామిక్ సంస్థ అధిపతి సైద్నా మఫద్దాల్ సైఫుద్దీన్‌కు పాకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారమైన నిషాన్-ఇ-పాకిస్థాన్ లభించింది. పాకిస్థాన్ అధ్యక్షుడు అరిఫ్ అల్వీ నవంబర్ 22న ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఈ పురస్కారం అందుకోనున్న నాలుగో భారతీయుడు సైఫుద్దీన్. 40 దేశాల్లో విస్తరించి ఉన్న దావూదీ బొహ్రా ఇస్లామిక్ సమాజానికి ఈయన అధ్యక్షుడిగా ఉన్నారు.

## అంతరిక్షం నుంచి లేజర్ సందేశం

అంతరిక్ష ప్రయోగాల్లో అద్భుతమైన ముందడుగు పడింది. అంతరిక్షంలోని 16 మిలియన్ కిలోమీటర్ల నుంచి భూమిపైకి తొలి లేజర్ సందేశం అందింది. ఇది భూమి, చంద్రుడి మధ్యదూరం కంటే 40 రెట్లు ఎక్కువ. ఇది ఆప్టికల్ కమ్యూనికేషన్ రంగంలోనే అతిగొప్ప మైలురాయి అని నాసా తెలిపింది. ఈ ప్రయోగం డీప్ స్పేస్ ఆప్టికల్ కమ్యూనికేషన్స్ (డీఎస్ఓసీ) అనే సాధనం ద్వారా సాధ్యమైంది. ఈ సాధనాన్ని ఈ ఏడాది అక్టోబర్ 13న ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి అంతరిక్షంలోకి ప్రయోగించిన సైక్ స్పేస్‌క్రాఫ్ట్‌లో పంపించారు. ఆ మరుసటి రోజు నుంచే ఈ సాధనం లేజర్ సందేశాన్ని భూమిపైకి పంపిస్తున్నది.

## ఐఎస్‌వో చైర్మన్‌షిప్‌లో భారత్

పంచదార, అనుబంధ ఉత్పత్తుల అత్యున్నత సంఘం ఇంటర్నేషనల్ షుగర్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌వో) చైర్మన్‌షిప్‌ను 2024 సంవత్సరానికి భారత్ మళ్లీ చేపట్టనుంది. లండన్‌లోని ఐఎస్‌వో ప్రధాన కార్యాలయంలో జరిగిన 63వ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత్‌కు ఇది అతిపెద్ద ఘనత అని, అంతర్జాతీయ పంచదార రంగాన్ని, మనదేశం నడిపించనుండటం గొప్ప విషయమని ఆహార మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సమావేశానికి భారత్ తరఫున కేంద్ర ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా హాజరయ్యారు. ప్రపంచంలో అతిపెద్ద పంచదార వినిమయ దేశంగా, రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా భారత్ ఉంది.

# జాతీయం

## పోస్టాఫీసుల్లో పార్సిల్ లాకర్ సేవలు



ఇండియా పోస్ట్‌తో కుదుర్చుకున్న భాగస్వామ్యం కింద పోస్టాఫీసుల్లో డిజిటల్ పార్సిల్ లాకర్ సేవలను ప్రారంభిస్తున్నట్లు బ్లూడార్ట్ పేర్కొంది. ఎటువంటి రశీదు, ప్యాకేజీపై సంతకం అవసరం లేకుండానే వినియోగదారులు పార్సిళ్లను ఈ లాకర్ల నుంచి తీసుకోవచ్చు. పార్సిల్‌ను పొందేందుకు వినియోగదారుడికి అందించిన కోడ్‌ను ఎంటర్ చేస్తే లాకర్ ఓపెన్ అవుతుందని తెలిపింది. ఏ సమయంలోనైనా డెలివరీలను తీసుకోవచ్చని, అధీకృత వ్యక్తులే ప్యాకేజీ అందించాల్సి ఉంటుందని వెల్లడించింది.

## అరుణాచల్ ప్రదేశ్‌లో 'మ్యూజిక్ ఫ్రాగ్'

అరుణాచల్ ప్రదేశ్‌లోని బ్రహ్మపుత్ర నదీతీరంలో శాస్త్రవేత్తలు 'మ్యూజిక్ ఫ్రాగ్' అనే కొత్తజాతి కప్పలను కనుగొన్నారు. ఆడ, మగ కప్పలు రెండూ చప్పుడు చేయడం వీటి ప్రత్యేకత. ఈ కొత్తజాతి కప్పలు రెండు మూడు రకాల చప్పుళ్లతో ప్రత్యేకమైన శబ్ద వ్యవస్థను కలిగి ఉంటాయి. అడవి బాతుల శబ్దాన్ని పోలి ఉన్న ఆ చప్పుడును గతంలో ఎప్పుడూ వినలేదని సైన్స్ పత్రిక జూటాక్సాలో శాస్త్రవేత్తలు రాశారు. వీటి పొడవు 6 సెంటీమీటర్ల మేర ఉండి దేహం మధ్యలో లేత క్రీం రంగులో గీత ఉంటుందని శాస్త్రవేత్తలు బిటుపన్ బోరువా, వి.దీపక్, అభిజిత్ దాస్ వెల్లడించారు.

## సుప్రీం తొలి మహిళా న్యాయమూర్తి మృతి

సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి జస్టిస్ ఫాతిమా బీవీ (96) కన్నుమూశారు. కేరళలోని కొల్లంలో నవంబర్ 23న చికిత్స పొందుతూ మరణించారు. గతంలో ఆమె తమిళనాడు గవర్నర్‌గా కూడా పనిచేశారు. 1983 నుంచి 1989 వరకు హైకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించారు. 1989 అక్టోబర్ 6 నుంచి 1992 ఏప్రిల్ 29 వరకు సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు.



## డాక్టర్ సీ మాణిక్యాంబ



జియోసైంటిస్ట్స్ అండ్ అలైడ్ టెక్నాలజిస్ట్స్ సొసైటీ (ఎస్‌జీఏటీ) ప్రదానం చేసే ఎక్సలెన్సీ అవార్డుకు ఎన్‌జీఆర్ఐ సైంటిస్ట్ డాక్టర్ సీ మాణిక్యాంబ ఎంపికయ్యారు. ఇనుము, మాంగనీస్, బంగారం, ప్లాటినం సమూహ మూలకాల ఖనిజ వనరుల అధ్యయనానికి ఆమెకు ఈ అవార్డు లభించింది. ఇప్పటివరకు 130కిపైగా అంతర్జాతీయ జర్నళ్లను ప్రచురించగా, 12 పీహెచ్‌డీలకు గైడ్‌గా వ్యవహరించారు. ధార్వాడ్ క్రాటన్, కడప, కృష్ణా-గోదావరి బేసిన్‌లో మాంగనీస్ వంటి వనరులపై పరిశోధన చేశారు. ప్రస్తుతం జలావరణం, జీవావరణం పరిణామ క్రమానికి సంబంధించిన అంశాలపై మాణిక్యాంబ అధ్యయనం చేస్తున్నారు.

# తెలంగాణ

## డా.తన్వి అరోరా

హైదరాబాద్‌లోని ఎన్‌జీఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ తన్వి అరోరా నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ అందించే శ్రేష్ఠ శాస్త్రవేత్త అవార్డుకు ఎంపికయ్యారు. భూగర్భ జలాల అన్వేషణలో క్రిటికల్ జోన్ విజ్ఞానశాస్త్ర రంగంలో పరిశోధన చేసినందుకు ఈ పురస్కారానికి ఆమె ఎంపికయ్యారు. డిసెంబర్ 14న లఖనవూలో ఆమె ఈ పురస్కారం అందుకుంటారని ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌కుమార్ వెల్లడించారు.



## జొకోవిచ్ రికార్డు విజయం

అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో సెర్బియా దిగ్గజం, ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ కొత్త చరిత్ర సృష్టించాడు. ఈ టోర్నీ చరిత్రలో అత్యధికసార్లు విజేతగా నిలిచిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇటలీ ప్లేయర్ యానిక్ సినెర్‌తో జరిగిన ఫైనల్లో జొకోవిచ్ 6-3, 6-3తో నెగ్గి టోర్నీని ఏడోసారి సొంతం చేసుకున్న తొలి ప్లేయర్‌గా నిలిచాడు. జొకోవిచ్ 2008, 2012, 2013, 2014, 2015, 2022లో ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో చాంపియన్‌గా నిలిచాడు. గతంలో రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) ఆరుసార్లు ఈ ట్రోఫీ ఫైనల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు.

## పంకజ్ అద్వాణీ@ 27

భారత స్టార్ ఆటగాడు పంకజ్ అద్వాణీ ప్రపంచ బిలియర్డ్స్‌లో టైటిళ్ల వేట కొనసాగిస్తున్నాడు. ఒకే వేదికలో రెండు టైటిళ్లను సొంతం చేసుకుని గ్రాండ్ డబుల్ సాధించాడు. నవంబర్ 21న ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. లాంగ్ ఫార్మాట్ ఫైనల్లో అద్వాణీ 1000-416తో భారత్‌కే చెందిన సౌరభ్ కొఠారిపై విజయం సాధించాడు. అదేవిధంగా నవంబర్ 24న పాయింట్ ఫార్మాట్ తుది పోరులో 5-0తో మళ్లీ సౌరభ్ కొఠారిని ఓడించాడు. ఈ టోర్నీలో 2003లో తొలిసారిగా విజేతగా నిలిచాడు. మొత్తం మీద 17 బిలియర్డ్స్, 10 స్నూకర్ టైటిళ్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఆసియా స్థాయిలో 10 టైటిళ్లను (7 బిలియర్డ్స్, 3 స్నూకర్) పంకజ్ గెలుచుకున్నాడు. బిలియర్డ్స్, స్నూకర్ ఫార్మాట్లలో అద్వాణీ గెలిచినన్ని టైటిళ్లు మరే ఆటగాడూ నెగ్గలేదు.



## ఆస్ట్రేలియాకు ఆరో ప్రపంచకప్

ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు ఖాతాలో ఆరో ప్రపంచ కప్ చేరింది. నవంబర్ 19న జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇండియాపై గెలుపొందిన ఆస్ట్రేలియా 2023 ప్రపంచ కప్‌ను సొంతం చేసుకుంది. ఇందులో విజేతకు రూ.33 కోట్లు, రన్నరప్‌కు 16 కోట్ల ప్రైజ్‌మనీ అందజేశారు. ఈ ప్రపంచ కప్‌లో 765 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా భారత ప్లేయర్ విరాట్ కోహ్లీ నిలిచాడు. 1987, 1999, 2003, 2007, 2015 లోనూ ఆస్ట్రేలియా జట్టు విజేతగా నిలిచింది.